క్లుప్తంగా

సేంద్రియ కూరగాయల స్టాల్ ప్రారంభం



కార్పొరేషన్ కార్యాలయం వద్ద స్టాల్ ప్రారంభించిన కమిషనర్ వెంకటకృష్ణ

ఏలూరు రూరల్ : సేంద్రియ కూరగాయలు, పండ్లు ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తాయని నగర కమిషనర్ ఎస్ వెంకటకృష్ణ అన్నారు. సోమవారం ఏలూరు కార్పొరేషన్ కార్యాలయం వద్ద ప్రకృతి వ్యవసాయంలో పండించిన కూరగాయల స్టాల్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయం రైతులకు పెట్టుబడి తగ్గించడంతో పాటు ప్రజలకు ఆరోగ్యకరమైన ఉత్పత్తులు అందిస్తుందన్నారు. ఈ విధానంపై రైతులు మరింత అవగాహన పెంచుకోవాలన్నారు. జీవామృతం, కషాయాలు, పంచాంగవ్య, కోడిగుడ్డుతో ద్రావణ తయారీ విధానాన్ని సాగుదారులు వివరించారు. జిల్లా ఏపీసీఎన్ఎఫ్ ప్రాజెక్టు మేనేజర్ డీపీఎం తాతారావు పర్యవేక్షణలో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో ఎంటీ సుబ్బరాజు, నాగరాజు, సతీష్, చామెండేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

నూకాలమ్మ హుండీల ఆదాయం రూ.1. 27 లక్షలు



హుండీల ఆదాయం లెక్కిస్తున్న దృశ్యం

ఏలూరు (ఆర్ఆర్‌పేట): స్థానిక కొత్తపేట నూకాలమ్మవారి ఆలయ హుండీల ఆదాయం 143 రోజులకు రూ.1,27,918 లభించింది. సోమవారం ఆలయ కార్యనిర్వహణాధికారి నాగం సన్యాసిరావు ఆధ్వర్యంలో స్థానిక పెద్దలు వెల్లంకి రాజు, జనపరెడ్డి కన రాజేశ్వరి కృష్ణ, నక్క నాగేశ్వరరావు తదితరులు హుండీల ఆదాయాన్ని లెక్కించగా, కార్యక్రమాన్ని హనుమాన్ జంక్షన్‌లోని అభయాంజనేయ స్వామి దేవస్థానం కార్యనిర్వహణాధికారి కూచిపూడి శ్రీనివాస్ పర్యవేక్షించారు.

నీటి పొదుపు పాటించాలి

గణపవరం: వంతులవారీ సాగునీటి విడుదల ప్రారంభించారని, రైతులు నీటిని పొదుపుగా వాడుకుని అధిక దిగుబడి సాధించాలని తాడేపల్లిగూడెం డివిజన్ ఏడియే మురళీ కృష్ణ రైతులకు సూచించారు. సోమవారం గణపవరం ఆర్‌బీకే వద్ద మండల వ్యవసాయ సలహా సంఘం చైర్మన్ కె.జగపతి రాజు అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. రైతులంతా ఈనెల 15వ తేదీలోపు ఈకేవైసీ పూర్తి చేసుకోవాలన్నారు.

భవిష్యత్తు బంగారుమయం

- ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు ట్యాబ్‌ల పంపిణీ
- బైజూస్ కంటెంట్‌తో డిజిటల్ పాఠాలు

ఏలూరు రూరల్ : కంప్యూటర్ పరిజ్ఞానం, డిజిటల్ విద్యాబోధన గత పాలకుల హయాంలో సర్కారు బడుల్లోని విద్యార్థులకు అందని ద్రాక్షగా ఉండేది. ఫలితంగా సాంకేతిక నైపుణ్యాన్ని, కంప్యూటర్ ఆధారిత అభ్యాసనాన్ని అందుకోలేక పేద విద్యార్థులు సతమతమయ్యేవారు. ప్రైవేటు పాఠశాల, కళాశాలలో చదువుకునే విద్యార్థులతో పోటీపడి సాఫ్ట్‌వేర్ రంగంలో ఉద్యోగాలు సాధించలేక అవస్థలు పడేవారు. నేడు పరిస్థితి మారింది. ప్రభుత్వ బడుల్లో చదువుకుంటున్న బాలబాలికలకు ట్యాబ్‌లు అందించాలన్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిర్ణయం పేద విద్యార్థులకు వరంగా మారింది. హైస్కూల్ స్థాయి నుంచి విద్యార్థులు కంప్యూటర్ పరిజ్ఞానంతో కూడిన విద్యా విధానాన్ని అలవర్చుకునేందుకు అవకాశం ఏర్పడింది. ప్రభుత్వ నిర్ణయం కారణంగా భవిష్యత్తులో పేద విద్యార్థులు సైతం సాఫ్ట్‌వేర్ రంగంలో ఇతరులతో పోటీ పడే అవకాశం పెరిగింది. కంప్యూటర్ విద్య, డిజిటల్ కంటెంట్ అందుబాటులోకి రావడంతో అసమానతలు తొలిగిపోనున్నాయి. భవిష్యత్తులో సాఫ్ట్‌వేర్ రంగంలో పట్టణ ప్రాంత విద్యార్థులతో పాటు గ్రామీణ ప్రాంతాల్లో చదువుకునే పేద విద్యార్థులు సైతం అద్భుతాలు సాధించే అవకాశం రానుంది.



వెంకటాపురం మండల పరిషత్ పాఠశాలలో ట్యాబ్‌లు అందుకున్న బాలబాలికలు

గ్రామాల వారీగా వివరాలు

ఏలూరు రూరల్ గ్రామాల్లోని 8 ప్రభుత్వ జెడ్పీ పాఠశాలలో 8, 9వ తరగతి చదివే 826 విద్యార్థులకు ప్రభుత్వం ట్యాబ్‌లు అందించింది. గతేడాది 426 మందికి, ఈఏడాది రెండోసారి మరో 400 మంది బాలబాలికలకు విద్యాశాఖ అధికారులు ట్యాబ్‌లు అందించారు.

విద్యార్థులకు అందించిన ట్యాబ్‌ల విలువ	
చాటపర్రు	రూ.16,32,986
పైడిచింతపాడు	రూ.8,36,326
ప్రత్తికోళ్లలంక	రూ.10,68,546
కోటేశ్వరదుర్గాపురం	రూ.2,18,998
కోమటిలంక	రూ.2,71,886
శ్రీపర్రు	రూ.16,72,652
పెదయాగనమిల్లి	రూ.1,32,110
గుడివాకలంక	రూ.18,38,762
జాలిపూడి	రూ.10,28,880
మల్కాపురం	రూ.10,02,436
మాదేపల్లి	రూ.10,94,990
మొత్తం	రూ.1,07,98,572

మంచి అవకాశం



8వ తరగతి విద్యార్థులకు ప్రభుత్వం ట్యాబ్‌లు అందించడం మంచి ఆలోచన. పాఠ్యాంశాన్ని బైజ్యూస్ కంటెంట్ ద్వారా వీడియో రూపంలో మరోసారి మననం చేసుకోవడం వల్ల పాఠాన్ని మరింతలోతుగా అర్థం చేసుకోవచ్చు. చాప్టర్ వారీగా పరిశీలన, మాదిరి పరీక్షలు, కంటెంట్ ట్యాబ్‌ల్లో పొందుపర్చారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుంటే ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు భవిష్యత్తులో రాణించవచ్చు.

– సింహం జస్వంత్, ట్రిపుల్ ఐటీ, స్టూడెంట్, మాదేపల్లి

విప్లవాత్మక మార్పు



పేద విద్యార్థుల భవిష్యత్తుకు తిరుగులేని భరోసా కల్పిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు. విద్య ద్వారానే జీవితాల్లో మార్పు వస్తుంది. అందుకే ప్రభుత్వం ఆంగ్ల మాధ్యమంతో పాటు బైజూస్ డిజిటల్ కంటెంట్‌తో పిల్లలకు ట్యాబ్‌లు అందిస్తోంది. ఉపాధ్యాయులు చెప్పే పాఠం వినడంతో పాటు యానిమేటెడ్ విధానంలో వీడియో రూపంలో విద్యార్థులు చూడడం వల్ల విద్యపై మరింత ఆసక్తి పెరుగుతుంది. అంతర్జాతీయస్థాయిలో మన విద్యార్థులు పోటీ పడగలరనే నమ్మకం కలుగుతోంది.

– పువ్వుల ఆంజనేయులు, పీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడు

నాయకులను కలిసిన జెడ్పీ చైర్‌పర్సన్ పద్మశ్రీ



వైవీ సుబ్బారెడ్డికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ పద్మశ్రీ, ప్రసాదరావు దంపతులు

ఏలూరు (మెట్రో): రాజ్యసభ సభ్యులుగా నామినేషన్ దాఖలు చేసిన వైవీ సుబ్బారెడ్డి, గొల్ల బాబూరావులను జెడ్పీ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ ప్రసాదరావు దంపతులు, ఉంగుటూరు ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబులు సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. వారికి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

టీచర్స్ టూల్ ట్రైనింగ్‌ను సెలవుల్లో నిర్వహించాలి

ఏలూరు (ఆర్ఆర్‌పేట): 10వ తరగతి పరీక్షల నేపథ్యంలో ఈ నెల 13 నుంచి ప్రారంభించే టీచర్స్ టూల్ ట్రైనింగ్ కార్యక్రమాన్ని వాయిదా వేసి, వేసవి సెలవుల్లో నిర్వహించాలని డెమోక్రటిక్ పీఆర్టీయూ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు డి.శ్రీను, పి.వెంకటేశ్వరరావు రాష్ట్ర ఎస్సీఈఆర్టీ డైరెక్టర్ బి.ప్రతాపరెడ్డికి విజ్ఞప్తి చేశారు. వేసవి సెలవుల్లో నిర్వహించడానికి వీలుకాని పక్షంలో, శిక్షణ కేంద్రాలను డివిజన్ పరిధిలోకి మార్చాలని వారు కోరారు.

వాసవీ మాతకు ప్రత్యేక పూజలు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): శ్రీ వాసవీ కన్యకాపరమేశ్వరి ఆత్మార్పణ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఏలూరు అర్బన్ జిల్లా ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు. ఉదయం 250 మంది ఆర్యవైశ్య మహిళలు స్థానిక వాసవీ కన్యకాపరమేశ్వరి సత్రం నుంచి కలశాలతో భారీ ఊరేగింపు నిర్వహించారు. అగ్రహారంలోని శ్రీ వాసవీ కన్యకా పరమేశ్వరి ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక అభిషేకాలు, 300 మందితో అమ్మవారికి కుంకుమ పూజలు చేశారు. కార్యక్రమంలో భక్తులకు ఆర్యవైశ్య అర్బన్ జిల్లా ప్రతినిధులు దుస్తులను బహూకరించారు. అనంతరం భక్తులకు అమ్మవారి ప్రసాద వితరణ గావించారు. కార్యక్రమంలో ఏలూరు అర్బన్ జిల్లా ఆర్యవైశ్య సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు చలువాది శివకృష్ణ బ్రహ్మయ్య, మోటమర్రి సదానంద కుమార్, కోశాధికారి నున్న శ్రీను, చెక్క రాజా, మద్దుల సత్యకుమార్, నగరపాలక సంస్థ విప్ పైడి భీమేశ్వరరావు, కార్పొరేటర్ బొలిశెట్టి సురేష్, నగరపాలక సంస్థ మాజీ డిప్యూటీ మేయర్ గుడివాడ రామచంద్ర కిషోర్ తదితరులు పాల్గొన్నారు.



కలశాలతో ఆర్యవైశ్య మహిళల ఊరేగింపు

మూర్ఛ వ్యాధిపై అవగాహన



కరుణోదయ విభిన్న ప్రతిభావంతుల విద్యాలయంలో అవగాహన కార్యక్రమం

ఏలూరు (టూటౌన్): ప్రపంచ మూర్ఛ దినోత్సవం సందర్భంగా స్థానిక జే అండ్ జే కరుణోదయ విభిన్న ప్రతిభావంతుల పాఠశాలలో డీబీఆర్‌సీ ఆధ్వర్యంలో సోమవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ హెన్నీ డోమినిక్ మాట్లాడుతూ ఏటా ఫిబ్రవరి రెండో సోమవారం ఈ దినోత్సవాన్ని నిర్వహిస్తున్నట్టు చెప్పారు. మూర్ఛ అనేది మెదడు వ్యాధి అని, నరాల కణాలు సరిగా సిగ్నల్ ఇవ్వకపోవడం మూర్ఛలకు కారణమవుతుందని వివరించారు. దీన్ని నయం చేయలేనప్పటికీ అనేక చికిత్సలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. మూర్ఛ ఉన్న వారిలో 70 శాతం మంది వరకు మందులతో వ్యాధిని తగ్గించుకొంటున్నారని చెప్పారు. డీబీఆర్‌సీ కో–ఆర్డినేటర్ డి.శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ ప్రపంచ వ్యాప్తంగా 50 మిలియన్ల మందికి మూర్ఛ ఉందన్నారు. జిల్లా పునరావాస కేంద్రం ద్వారా దివ్యాంగులకు అవసరమైన ఫిజియోథెరఫీ, స్పీచ్ థెరపీ, ఆడియోలజీ, కృత్రిమ అవయవాలు, మొదలగు సేవలు అందిస్తున్నట్టు చెప్పారు. కార్యక్రమంలో డీబీఆర్‌సీ సిబ్బంది, పాఠశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదాలతో ఆర్థిక, ప్రాణ నష్టం



మాట్లాడుతున్న ఎంవీఐ ప్రసాద్

ఏలూరు (ఆర్ఆర్‌పేట): రోడ్డు ప్రమాదాల వల్ల అపారమైన ప్రాణ, ఆర్థిక నష్టాలు సంభవిస్తున్నాయని, రోడ్డు భద్రత నియమాలు పాటించడం ద్వారా చాలా ప్రమాదాలను నివారించవచ్చని మోటార్ వెహికల్స్ ఇన్‌స్పెక్టర్ కేవీఎస్ ప్రసాద్ అన్నారు. జాతీయ రోడ్డు భద్రత మాసోత్సవాల్లో భాగంగా సోమవారం స్థానిక సీఆర్ఆర్ మహిళా కళాశాలలో రోడ్డు భద్రతపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. జీబ్రా గుర్తు ఉన్న చోట మాత్రమే రోడ్డు దాటాలని, ఫుట్‌పాత్‌లు ఉన్న చోట్ల రోడ్డుకు కుడివైపున నడవాలని ప్రసాద్ సూచించారు. వాహనాలు నడుపుతున్నప్పుడు ట్రాఫిక్ ఐలాండ్ (రోడ్డు మధ్యలో ఉండే కట్ట) నుంచి బయటకు అడుగు పెట్టడం చాలా ప్రమాదమని, కనపడని రోడ్డు మలుపుల వద్ద మరింత జాగ్రత్తగా ఉండాలన్నారు. సీట్ బెల్టు, హెల్మెట్ ధరించాలని, వాహనదారులు మలుపు తిరిగేటప్పుడు సిగ్నల్ ఇవ్వాలని, వన్‌వేలో వాహనాలు నడపరాదని తెలిపారు. కార్యక్రమంలో మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ జి.ప్రసాదరావు, కళాశాల ప్రిన్సిపాల్ పి.శైలజ, సిబ్బంది, కళాశాల బస్సు డ్రైవర్లు, విద్యార్థినులు పాల్గొన్నారు.

15న సెలవు ప్రకటించాలి

ఏలూరు (ఆర్ఆర్‌పేట): ఆదివాసీ గిరిజన తెగల్లోని లంబాడా గిరిజనుల ఆరాధ్య దైవం సంత్ సేవాలాల్ జయంతిని పురస్కరించుకుని ప్రతి ఏటా ఫిబ్రవరి 15న రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా సెలవు దినంగా ప్రకటించాలని అఖిల భారత గిరిజన ఉద్యోగుల సంఘం ఏలూరు జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బి.రాము, నంబూరి శ్రీనివాసరావు ఒక ప్రకటనలో కోరారు. రాష్ట్రంలో లంబాడా, సుగాలి, బంజారా తెగల ప్రజలు దాదాపు 15 లక్షల మంది జనాభా ఉన్నారని, కొన్నేళ్లుగా ప్రభుత్వం సేవాలాల్ జయంతి నిర్వహించేందుకు రూ.లక్ష కేటాయించేదని గుర్తు చేశారు. లంబాడా ప్రజలు ఉన్న జిల్లాలకు సేవాలాల్ జయంతి నిర్వహణకు రూ.3 లక్షలు కేటాయించాలని విజ్ఞప్తి చేశారు.

ఏలూరు సమగ్రాభివృద్ధికి కృషి

- ఎమ్మెల్యే, పార్టీ జిల్లా అధ్యక్షుడు నాని
- రూ.5.37 కోట్ల పనులకు శంకుస్థాపన

ఏలూరు టౌన్ : ఏలూరు నగర సమగ్రాభివృద్ధికి ప్రత్యేక ప్రణాళికతో పనిచేస్తున్నామని ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు ఆళ్ల నాని అన్నారు. ఏలూరు నగరంలో నాలుగు డివిజన్లల్లో అభివృద్ధి పనులకు ఆయన సోమవారం ఏలూరు నగర మేయర్ షేక్ నూర్జహాన్‌తో కలిసి శంకుస్థాపనలు చేశారు. 11వ డివిజన్‌లో రూ.2.25 కోట్లతో సీసీ రోడ్లు, డ్రెయిన్ పనులకు, 12వ డివిజన్‌లో రూ.1.09 కోట్లతో, 14వ డివిజన్‌లో రూ.1.02 కోట్లతో, 15వ డివిజన్‌లో రూ.1.01 కోట్లతో చేపట్టే అభివృద్ధి పనులకు నాని శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాని మాట్లాడుతూ ఏలూరు నియోజకవర్గంలో గతంలో ఎన్నడూ లేనివిధంగా భారీ ఎత్తున నిధులు వెచ్చించి అభివృద్ధి పనులు చేపడుతున్నామని చెప్పారు. ఈ ఒక్కరోజే సుమారుగా రూ. 5.37 కోట్ల విలువైన పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశామన్నారు. ఇప్పటికే నగరంలో వందల కోట్లతో సీసీ రోడ్లు, సీసీ డ్రెయిన్లు, కల్వర్టుల నిర్మాణం వంటి అభివృద్ధి పనులు చేస్తున్నామని వివరించారు. మేయర్ షేక్ నూర్జహాన్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాయకత్వంలో ఎమ్మెల్యే నాని సారథ్యంలో నగరంలో అభివృద్ధి పనులు చేపడుతున్నామని చెప్పారు. ఏలూరు నియోజకవర్గంలో 30 వేల మంది పేద, మధ్యతరగతి వర్గాలకు గూడు కల్పించేందుకు ఇళ్ల పట్టాల పంపిణీ చేశామని తెలిపారు. నగరంలో రోడ్ల అభివృద్ధితో పాటు సెంట్రల్ డివైడర్, సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు చేసి నగరాన్ని ఆహ్లాదకరంగా ఉంచేందుకు చర్యలు చేపట్టామన్నారు. ఇడా చైర్మన్ బొద్దాని శ్రీనివాస్ మాట్లాడుతూ ఎమ్మెల్యే నాని సహకారంతో ఏలూరు అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ ఆధ్వర్యంలో ఏలూరు నగరాన్ని సుందరంగా తీర్చిదిద్దేందుకు కార్యాచరణ ప్రణాళిక రూపొందిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో నగర డిప్యూటీ మేయర్లు గుడిదేశి శ్రీనివాస్, నూకపెయ్యి సుధీర్‌బాబు, పార్టీ జిల్లా కోశాధికారి మంచెం మైబాబు, కార్పొరేటర్లు తంగెళ్ల రాము, కోయా జయగంగ, కర్రి శ్రీనివాసరావు, దారపు అనూష, పార్టీ నాయకులు నిడికొండ నరేంద్ర, జయరామిరెడ్డి, నగర కమిషనర్ సంక్రాంతి వెంకటకృష్ణ పాల్గొన్నారు.



15వ డివిజన్‌లో శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే నాని, చిత్రంలో మేయర్ నూర్జహాన్, ఇడా చైర్మన్ బొద్దాని



11వ డివిజన్‌లో శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే నాని, చిత్రంలో మేయర్ నూర్జహాన్, ఇడా చైర్మన్ బొద్దాని

ఈ–చలానాలను రద్దు చేయాలి



కలెక్టరేట్ వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న నాయకులు

ఏలూరు (టూటౌన్): స్టాప్ లైన్ వైలేషన్ పేరుతో ఆటో, టాక్సీ ఇతర వాహనాలపై విధించిన ఈ–చలానాలను భేషరతుగా రద్దు చేయాలని ఆల్ ఇండియా రోడ్ ట్రాన్స్‌పోర్టు వర్కర్స్ ఫెడరేషన్ ఏలూరు జిల్లా కార్యదర్శి జె.గోపి కోరారు. స్థానిక జూట్ మిల్లు సెంటర్ నుంచి కలెక్టరేట్ వరకు ఆటోలు, ట్యాక్సీలతో భారీ ర్యాలీ నిర్వహించారు. కలెక్టరేట్ వద్ద ధర్నా చేశారు. కార్యక్రమంలో గోపి మాట్లాడుతూ ఏలూరు పాతబస్టాండ్ వద్ద ఉన్న సిగ్నల్ పాయింట్ స్టాప్ లైన్, సీసీ కెమేరాలు సరైన పద్ధతిలో లేవని, వాటిని క్రమబద్ధీకరించాలని కోరారు. అప్పటి వరకు విధించిన చలానాలను రద్దు చేయాలని కోరారు. అనంతరం జిల్లా కలెక్టర్‌కు సమస్యలతో కూడిన వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో బుద్ధ నాగ సూరిబాబు, దుర్గారావు, మెరుగు రాఘవ, వల్లూరి ఆంజనేయులు తదితరులు మాట్లాడారు.

బాలమేళాలో ఆటల పోటీలు

ఏలూరు రూరల్: స్థానిక చొదిమెళ్ల మండల పరిషత్ పాఠశాలలో సోమవారం బాలమేళా నిర్వహించారు. చైల్డ్‌రైట్స్ అడ్వకసీ ఫౌండేషన్ కోఆర్డినేటర్ ఎస్ రవికుమార్ ఆధ్వర్యంలో పిల్లలకు ఆటల పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ బత్తిన విజయకుమార్ మాట్లాడుతూ బాలబాలికలు ఆరోగ్యం, మానసికంగా దృఢంగా ఉండాలన్నారు. ఇందుకు అనుకూలమైన వాతావరణం సృష్టించేందుకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని కోరారు. మంచి ఆలోచనలతో పిల్లలు ఎదగాలన్నారు. ఆటలు, చదువు పట్ల పిల్లలకు ఉన్న శ్రద్ధను గుర్తించి ప్రోత్సహించాలన్నారు. అనంతరం జబ్‌జూనియర్, జూనియర్, సీనియర్ విభాగాల్లో విజేతలకు బహుమతులు అందజేశారు.

బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతే లక్ష్యం

పెదపాడు: పేద, బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతే వైఎస్సార్ సీపీ ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి అన్నారు. సంక్షేమం, అభివృద్ధి రెండు కళ్లుగా ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారని ఆయన అన్నారు. దెందులూరు, పెదపాడు మండలంలోని పాతపెదపాడు, రాజుపేటలో ఎంపీ అభ్యర్థి, ఏలూరు పార్లమెంట్ కోఆర్డినేటర్ కారుమూరి సునీల్ కుమార్ యాదవ్‌తో కలిసి ప్రజా ఆశీర్వాద యాత్ర నిర్వహించారు. కార్యక్రమంలో అబ్బయ్యచౌదరి ప్రజలకు అభివాదం చేస్తూ వారి సమస్యలు తెలుసుకున్నారు. పాతపెదపాడులో మంచినీటి చెరువు అభివృద్ధి చేయాలని, రాజుపేటలో డ్రెయినేజీలు నిర్మించాలని స్థానికులు కోరడంతో దీనిపై ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించి అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా అబ్బయ్యచౌదరి మాట్లాడుతూ అన్ని వర్గాల ప్రలకు సంక్షేమ పథకాలు అందించామని చెప్పారు. సీఎం జగనన్న విద్య, వైద్య రంగాల్లో విప్లవాత్మక మార్పులు తీసుకురావడంతో ప్రతి కుటుంబానికి లబ్ధి చేకూరుతోందన్నారు. పెదపాడు మండలంలోని నాయుడుగూడెంలో, పెదపాడులోని తెలగాలపేటలో ఇల్లు నిర్మించుకున్న లబ్ధిదారులకు ఇళ్ల పట్టాలను అందించారు. రాబోయే ఎన్నికలలో వైఎస్సార్ సీపీ ఘన విజయం అందించాలని కోరారు. కార్యక్రమంలో పెదపాడు ఎంపీపీ బత్తుల రత్నకుమారి, దెందులూరు జెడ్పీటీసీ నిట్టా లీలా నవ కాంతం, పెదపాడు సొసైటీ అధ్యక్షుడు అక్కినేని రాజశేఖర్, మండల ఉపాధ్యక్షురాలు రెడ్డి స్వర్ణకుమారి, ఎంపీటీసీ అక్కినేని గోపి, విజిలెన్స్ మోనిటరింగ్ కమిటీ సభ్యుడు కత్తుల రవికుమార్, రాజుపేట సర్పంచ్ తొందురు క్రాంతి కుమార్, గుణుపూరు మహేష్, సీనియర్ నాయకుడు గారపాటి భాస్కరరావు, బత్తుల ఏసురాజు, కొత్తూరు విమలారావు పాల్గొన్నారు.

కూరగాయల ధరలు

ఏలూరు నగరంలోని రైతు బజార్లలో కూరగాయల ధరలు

కూరగాయలు	కిలో ధర	కూరగాయలు	కిలో ధర
టమాటాలు	28	అరటి కాయ (1)	05-07
వంకాయలు (గులాబీ)	18	చిక్కుడు కాయలు	30
వంకాయలు (కాంతులు)	28	చామదుంపలు	64
వంకాయలు (తెలుపు)	32	ములక్కాడలు	08-10
బెండకాయలు	36	కంద	60
పచ్చిమిర్చి	36	బీట్‌రూట్	40
కాకర కాయలు	50	కీరా దోస	34
బీరకాయలు	44	ఫ్రెంచ్‌బీన్స్	70
కాలీఫ్లవర్	25-30	అల్లం	120
క్యాబేజీ	20	కొత్తిమీర (కట్ట)	15
క్యారెట్	30-34	పాలకూర	10
దొండకాయలు	34	చుక్కకూర	10
బంగాళదుంపలు	26	తోటకూర	10
ఉల్లిపాయలు	20-25	గోంగూర	08
గోరుచిక్కుడు	34	పుదీనా	05
దోసకాయలు	30	బఠాణి	--
ఆనబకాయ (1)	20-25	క్యాప్సికమ్	70
పొట్లకాయ(1)	15-20	చిలకడదుంప	34

ఆర్టీసీ సమాచారం

ఏలూరు ఆర్టీసీ డిపో నుంచి దూరప్రాంతాలకు వెళ్లే బస్సుల సమయాలు, రిజర్వేషన్ వివరాలు

ఏసీ బస్సులు..

బస్సు రూటు	సమయం	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు –బీహెచ్‌ఈఎల్ వయా విజయవాడ (ఇంద్ర)	21.00	30
ఏలూరు –బీహెచ్‌ఈఎల్ (అమరావతి)	22.00	38
ఏలూరు – బీహెచ్‌ఈఎల్ (అమరావతి)	22.30	44
ఏలూరు – తిరుపతి(ఇంద్ర)	16.00	35
ఏలూరు – తిరుపతి(ఇంద్ర)	19.00	34

సూపర్ లగ్జరీ

బస్సు రూటు	సమయం	సర్వీస్ నంబర్	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు –బీహెచ్‌ఈఎల్	21.45	4820	20
ఏలూరు –బీహెచ్‌ఈఎల్ వయా కే.కోట	19.30	4796	17
ఏలూరు –బీహెచ్‌ఈఎల్ వయా రామచంద్రపురం	19.45	4798	19
ఏలూరు –జీడిమెట్ల వయా ఖమ్మం	20.15	4802	21
ఏలూరు –జీడిమెట్ల వయా ఖమ్మం	21.00	4804	30
ఏలూరు –ఈసీఐఎల్	22.30	4814	22
ఏలూరు – విశాఖపట్నం	12.00	4840	32